# ఛాయ

నేను ప్లాట్‌ఫామ్ మీదికి అడుగు పెడ్తుండగా ట్రైన్ 'కూత' వేయడం విన్పించింది. కదుల్తోన్న బండిలోకి ఎట్లానో ఎక్కేయడమే కాకుండా, కూర్చొనేందుకు సీటుకూడా సంపాదించుకోగలగటంతో ఎక్కడలేని సంతోషం కలిగింది నాకు. సర్దుకొని కూర్చున్న తర్వాత తీరిగ్గా ఎదుటిసీటు వైపు చూస్తూనే అప్రతిభుడయ్యేను.

ఎదురుగా స్థిమితంగా కూర్చొని కిటికీ అంచుపై మోచేయుంచి, ఆ అరచేతితో చెంపనానుకుని కొద్దిగా తలవాల్చి చిరునవ్వుతో నా ముఖంలోకే చూస్తోంది 'ఛాయ'. "ఛాయా" నా పెదవులు అస్పష్టంగా గొణగటం ఛాయ గమనించింది కాబోలు. 'అవును నేనే' అన్నట్లు తలవూపింది, మరికొంచెం నవ్వుతో ముఖాన్ని వెలిగిస్తూ. అట్లా నవ్వగలగటం 'ఛాయ'కొక్కదానికే చేతనవునేమో? ఆ నవ్వు చిన్నగా పెదిమల మీద ప్రారంభమై, చెక్కిళ్ళ మీదుగా ప్రాకి, కళ్ళలోకి చేరి ముఖమంతా వెలిగిస్తుంది.

రైలు చక్రాల చప్పుడు మధ్యకూడ ఎంతో స్పష్టంగా నాగుండె కొట్టుకోవటం నాకే విన్పిస్తోంది. సంతోషం, దిగులు, బాధ, సిగ్గు ఇన్ని భావాలు ఒక్కుమ్మడిగా ముప్పిరిగొంటే ఎట్లా ఉక్కిరి బిక్కిరౌతారో నాకిప్పుడే అర్థమౌతోంది.

"చాలాకాలం తర్వాత కన్పించేరు, అనుకోకుండా" ఛాయ మామూలుగానే అన్నా నేనే ఉలిక్కిపడ్డాను. నేరం చేసిన వాడిమల్లే తలొంచుకొన్నా.

"అవును" నాకే విన్పించనంత మెల్లగా అన్నా. ఛాయకి నామీద కోపంగా లేదా? అసహ్యం కల్గటం లేదా నన్నిప్పుడు చూస్తోంటే? ఈ నాలుగు సంవత్సరాల కాలమూ ఛాయ వయస్సుని ఒక్క సంవత్సరం మాత్రమే పెంచినట్లుంది. అదే రూపం— ఏ మార్పు లేకుండా.

"ఎక్కడి నుండి వస్తున్నారు? ఎక్కడుంటున్నారు? ఎక్కడి కెళ్తున్నారు? పిల్లలెంతమంది?" ఛాయ వరసగా అడిగేసింది. నిజానికి చివరిది మినహాయిస్తే మిగిలిన ప్రశ్నలు నేనే ఛాయని అడుగుదామనుకొంటున్నా. చివరి ప్రశ్న మాత్రం నన్ను వీపు మీద కొరడాతో బాదినట్లన్పించింది. ఛాయకి జవాబు చెప్పేలోగా ఈ రైలు పట్టాల్తప్పటమో, మరోటో ఏదైనా జరక్కూడదూ? అన్పించింది. జవాబుల కొసం నా వైపే చూస్తోంది ఛాయ.

"ఒక్కడే బాబు. నిన్ననే 'బారసాల'కి వచ్చి వెళ్తోన్నా. ప్రస్తుతం పనిచేస్తోంది 'భీమవరం'లో వెళ్ళేది కూడ అక్కడికే" జవాబివ్వక తప్పలేదు.

"వెరీగుడ్ మ్యాన్. బాబు పేరేమిటి?" ఛాయ ముఖంలో సంతోషం నన్ను వెక్కిరిస్తోంది. ఆ సంతోషం నిజమైందేనా? నిష్కల్మషంగా మెరుస్తోన్న ఛాయ కళ్ళు చూశాక నా వూహకు నాకే సిగ్గనిపించింది. "చక్రధర్".

ఛాయ పేరులో ఒక్క అక్షరమైనా కల్పిరావాలని ఆ పేరు పెట్టేను. అసలు పాప పుడితే ఛాయ పేరే పెడదామనుకొన్నా. నేనింకా తనని మర్చిపోలేదని ఛాయ అర్థం చేసుకొంటుందా? "మీరెందాకా వెళ్తున్నారు?" చెలరేగుతున్న మిగిలిన ప్రశ్నల్ని గుండెలోనే అణిచేసి అది మాత్రం అడిగేను. "కాకినాడ వెళ్తున్నా ఫ్రెండ్ పెళ్ళికి" ఛాయ జవాబు చెప్పింది.

నాకెన్నో అడగాలని వుంది. ఛాయ పెళ్ళి చేసుకొందా మళ్ళా? నాకు హఠాత్తుగా వాళ్ళ అమ్మా, నాన్నలు గుర్తుకొచ్చేరు.

"అమ్మా, నాన్న బాగున్నారా?" అడిగేను.

"నా గురించిన బెంగ వాళ్ళని తినెయ్యకపోతే యింకా బాగుండేవారు" ఛాయ పల్చగా నవ్వింది.

"వాళ్ళు మిమ్మల్నెప్పుడూ తల్చుకొంటూనే వుంటారు" అంది మళ్ళా.

"నన్నా? ఎందుకూ?" ఇంకా వాళ్ళు నన్ను మర్చిపోలేదా?

"చాలా మంచివాళ్ళని" ఛాయ నవ్వు మెత్తని కత్తిలా గుండెని తాకింది.

ఛాయా! ఛాయా!! నేచేసింది తప్పే. కాదనను. నేను పిరికివాడినే. ఒప్పుకొంటా ఆ విషయం. కాని నువ్విట్లా మెత్తని మాటల్తో నన్ను చిత్రవధ చెయ్యకు. నా మనసు ఆక్రోశిస్తోంది. ఒకప్పుడు మనసులో మల్లెల సౌరభాల్ని నింపిన ఛాయ నవ్వు ఇప్పుడిట్లా గుండెలో గాయం చేస్తోందేం?

ఛాయ కిటికీలోనుండి బయటికి చూస్తోంది. నేను ఛాయవైపే చూస్తోన్నా. మనసు ఆమె చుట్టే పరిభ్రమిస్తోంది.

*** *** ***

నేనా గదిలో చేరిన సాయంత్రం బావిదగ్గర నీళ్ళు తోడుకునేందుకు వెళ్ళాను. బకెట్ బావిలోకి వదిలి తలెత్తి చూస్తే— పశ్చిమాకాశం ఎర్రవౌతూ కన్పించింది. నిజంగా సూర్యోదయము, సూర్యాస్తమయం ఎంత సుందరదృశ్యాలు? రోజూ చూసినా ఎప్పటికప్పుడే ఎంత క్రొత్తగా, ఎంతందంగా కన్పిస్తాయి? ఇంత గొప్ప దృశ్యాలూ రోజూ జరగటంతో జనానికి ఎంతో మామూలై పోయేయి— అంటారు చలం. ఆయన మాటల్లో ఎంత నిజం వుంది?

"నీళ్ళు తోట్టం మానేసి మరీ చూస్తున్నారు కదా? ఆ సూర్యాస్తమయం మీద కవిత్వం వ్రాస్తారా? లేక చిత్రంగా గీస్తారా?

వినవచ్చిన ప్రశ్నకి నా వూహలు చెదిరి తలత్రిప్పి చూసేను. కొంచెం దూరంలో సన్నజాజి పందిరి దగ్గర కుర్చీమీదెక్కి నిలబడి పూలుకోస్తోంది ఓ అమ్మాయి. చేస్తోన్న పనిని మధ్యలో ఆపి పందిరి గుంజ మీద గడ్డం ఆన్చి, తల కొద్దిగా వాల్చి నావైపే చూస్తోంది. ఓ చేతిలో పూలు వేసుకొనేందుక్కాబోలు గిన్నెవుంది. అరుణ కాంతి ఆ అమ్మాయి చెక్కిలిమీద ఎర్రగా ప్రతిఫలిస్తోంది. "ఏమీ వైను. రూమ్‌కెళ్ళి స్నానం చేస్తా" నేనేం చేస్తే ఈపిల్లకెందుకూ? అనుకొంటూ బరబరా నీళ్ళు తోడేశాను.

"మీకు మా నాంగారు బాత్‌రూం వుందని చెప్ప లేదా?" ఆ అమ్మాయి వొదిలేట్టు లేదు.

"ఆహా! లావెటరీ వుందని కూడా చెప్పేరు. అందుకేగా అరవైరూపాయలు అద్దె కిష్టపడి మరీ దిగేను?" వెటకారంగా జవాబిచ్చేను. అసలింతవరకు అమ్మాయిల్తో మాట్లాడి ఎరుగని నాకు అంత ధైర్యం ఎక్కణ్ణించి వొచ్చిందో తెలీదు.

"చాలా సంతోషం. మరి లక్షణంగా బాత్‌రూం వుందని తెల్సికూడ రూమ్‌లో స్నానం చెయ్యటం ఏమిటి? ఏమో బాబూ, 'పుర్రెకోబుద్ధి' అన్నారుగా పెద్దలు" ఆ అమ్మాయి ముఖంలో కొంటె నవ్వు.

నేను షాక్‌తిన్నా. ఏం జవాబు చెప్పాలో చెతుక్కొనేసరికి "అమ్మా ఛాయ యింకా పూలు కోయటం కాలేదా తల్లీ?" అన్న పిలుపు, వెంటనే ఆ అమ్మాయి ఛెంగున కుర్చీలోంచి గెంతి, కుర్చీనక్కడే వొదిలేసి, గిన్నెతో లోపలికి పరుగుతీయటం జరిగిపోయింది.

"ఓహో! ఈవిడగారి పేరు 'ఛాయ'న్న మాట" అనుకొంటూ బకెట్ తీసికొని నా రూమ్‌కొచ్చేను. ఒచ్చిన తర్వాత అనుకొన్నా. ఆ అమ్మాయి గొంతు చాలా బావుంది అని. అమ్మాయింత చిన్నగా, మృదువుగా కూడా మాట్లాడగలరని నాకప్పుడే తెలిటం.

ఆ రాత్రి హోటల్ మెతుకులు తిని రూమ్‌లో కొచ్చి పుస్తకం చదూకొంటూ పడుకొనుంటే విన్పించింది ప్రక్కగదిలో నుండి "ఛాయ" నవ్వు. ఒక్కసారి వీణ తీగెలు సున్నితంగా మీటినట్లు పొగడ పూలు జలజల రాలినట్లు ఎంత చక్కగా వుంది ఆ నవ్వు?

జాస్తి రమాదేవి



నేను పుట్టిందీ, పెరిగిందీ కూడా ఒంగోలు దగ్గర చిన్న పల్లెటూర్లో. మా యింట్లో నేనే పెద్ద కొడుకుని. నా తర్వాత యిద్దరు చెల్లెళ్ళు, ఇంకో తమ్ముడు వున్నారు. మానాన్న ఇంట్లో కేక పెడ్తే పొలంలోకి వినిప్తుంది జీతగాళ్ళకి. అంతో యింతో తక్కువగా మా అమ్మకూడ అంత గట్టిగాను మాట్లాడగలదు. ఇంక చెల్లెళ్ళు సరేసరి. ఇంట్లో ఎవరికీ చెవుళ్ళాంటివి లేక పోయినా వీళ్ళంత గట్టిగా ఎందుకు మాట్లాడుతారో అర్ధం కాదు. నేనదే మాట అంటే అమ్మ నావైపు విచిత్రంగా చూస్తుంది.

"నీతో మాట్లాడేటపుడు అట్లానే చెవిలో మాట్లాడుతాంలే అన్నయ్యా"అని ఓ చెల్లెలంటే 'పది నొచ్చిం తర్వాత తనకి చెప్పధువుగానిలే అన్నయ్యా" అని మరో చెల్లి దీర్ఘం తీసేది.

నాకీ 'ఆరిందాతనం'అంటే ఒళ్ళుమంట. వీళ్ళకి చదువుసంధ్యలుతలకెక్కవుకాని ఇట్లాంటి పెద్దకబుర్లు మాత్రం నరనరానా జీర్ణించి పోతాయి. వాళ్ళ వేళా కోళాలన్నీ సాధారణంగా 'పెళ్ళి, మొగుడు, పెళ్ళాం' వీటికి సంబంధించినవే అయివుంటాయి. వాళ్ళట్లా మాట్లాడ్తుంటే అమ్మ 'తప్ప'ని మందలించదు సరి కదా 'గొప్ప హాస్య'మనుకొని ముసిముసి నవ్వులు నవ్వు కొంటుంది. చిన్నపిల్లల నోటివెంట ఆ ఆరిందా కబుర్లు ఎంత అసహ్యం అన్పిస్తాయో ఆమెకి తెలీదు, చెప్పినా అర్థం చేసుకోదు. వాళ్ళకో అక్షరం ముక్క నేర్పాలన్న నేచేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావటానికి ముఖ్యకారణం అమ్మ విముఖత్వం, వాళ్ళ అనాసక్తి తర్వాతది.

"ఆడదానికి చదువెందుకు. మొగుడికింత వుడ కేసి పెట్టగలిగితే చాలు" అని ఆవిడ నిశ్చితాభిప్రాయం. నాన్నకి పొలం పనుల్తో యింటి గురించి పట్టించుకొనే తీరికా, ఓపికా రెండూ తక్కువే. ఆయన గొడవ ఆయనిది. ఇట్లాంటి వాతావరణంలో నేను ఆ డిగ్రీ కాస్తా పూర్తయిందన్పించటమే కాక, స్వశక్తితో ఉద్యోగం కూడ సంపాదించుకోగలిగేను, రెండేళ్ళలో. ఆ విష యం మా నాన్న వూరంతా గర్వంగా చెప్పకొంటాడు మీసాలు మెలివేస్తూ.

ఛాయ ఎందుకో మళ్ళీ నవ్వుతోంది. ఎంతో శ్రావ్యంగా మళ్ళీ మళ్ళీ వినాలన్పించేలా నవ్వుతోంది. మా యింట్లో ఎవరు నవ్వినా డబ్బాలో గులకరాళ్ళు పోసి మ్రోగించినట్లు ధ్వనిస్తూ నాలుగు వీధులవతలకి విన్పిస్తూవుంటుంది. మా ఆఫీసులో 'లక్ష్మి' అని ఓ టైపిస్ట్వుంది. చదువుకొన్నదే అయినా ఆ అమ్మాయి కూడా అంతే. చాలా గట్టిగా మాట్లాడుతుంది. నవ్వితే నోట్లో దంతాల్తో సహా లెక్కపెట్టొచ్చు మనం. అంతం దంగా నవ్వుతోంది. నాకా పిల్ల నవ్విందంటే భయం. ఆ అమ్మాయిని 'వజ్రదంతి'(వజ్రముల వంటి కఠిన మైన దంతములు కలది అని అర్ధమట)అని ముద్దు పేరుందని నా కొలీగ్ 'రమణ' చెప్పేడు.

"ఏమిటే ఆ నవ్వు? ఆడదానికంత నవ్వెందు కొస్తుందసలు? నవ్వు నాలుగువిధాల చేటని పూరికే

అన్లేదు పెద్దవాళ్ళు'' ఛాయా వాళ్ళమ్మ శాబ్దాలు కోప్పడుతోంది.

ఛాయ నవ్వు చప్పున ఆగిపోయింది. వింటోన్న చక్కని పాట మధ్యలో ఆగిపోయినట్లు అన్పించింది నాకు.

*** *** ***

తర్వాత నెల్రోజుల్లో ఛాయతో నా పరిచయం కొంచెం ముందుకెళ్ళింది. ఛాయ బాంక్‌లో 'జాబ్' చేస్తోంది. ఛాయ, వాళ్ళమ్మ, నాన్న ముగ్గురే వుంటారు యింట్లో. వాళ్ళన్నయ్య విశాఖపట్టణంలో 'జాబ్' చేస్తున్నాడు. ఇవే నాకు తెల్సిన విషయాలు.

ఛాయ చాలా సామాన్యంగా కన్పిస్తుంది మామూలుగానే. కాని అవ్యక్తమైన ఆకర్షణ ఆమె 'కళ్ళ'లో వుందన్పిస్తుంది. అట్లాగని ఆ కళ్ళు చారెడేసి పెద్దవిగానూ వుండవు, కలువరేకుల్లానూ వుండవు. అంత పెద్దవీ, అంత చిన్నవీకాని ఆ కళ్ళలో ఏదో ఆత్మ విశ్వాసమూ, కాంతీ కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి. మరో ఆకర్షణ వింటానికీ, చూట్టానికీ కూడా బాగుండే ఛాయ 'నవ్వు' ఎప్పుడూ ఉత్సాహం ఉరకలు వేస్తున్నట్లుగా వుండే ఛాయతో మాట్లాట్టం నాకెంతో యిష్టంగా అన్పించేది.

సాధారణంగా సాయంత్రం వేళ రాగానే స్నానం చేసేసి 'మల్లెపూవు'లా తయారై ఏదో ఓ పుస్తకం చేత పట్టుకొని డాబామీదికెళ్ళిపోయి చదుకొంటూ కూర్చొనేది ఛాయ. నాక్కూడ కొంచెం పుస్తకాలు చదివే అలవాటు వుండటంతో ఛాయతో కబుర్లాడేందుకు అదో మంచి సాధనమైంది నాకు.

''కన్నీటి కెరటాలు'' నవల చాలా బావుంది కదూ?'' అంది ఛాయ ఓసారి చేతిలో పుస్తకం చూపిస్తూ. ''ఆ బాగుంది. బళ్ళకొద్దీ అపార్థాలు, బస్తాల కొద్దీ త్యాగాలు, కడవల కొద్దీ కన్నీళ్ళు— చాలా బాగుంది''నేను వెక్కిరింపుగా అన్నాను.

''ఆడవాళ్ళ బాధలు, సమస్యలు మీకు వెక్కిరింపుగానే వుంటాయి''అంది ఛాయ. ''ఆడవాళ్ళకేనా సమస్యలు, బాధలు? మగవాళ్ళకి లేవా ఏమిటి? మనిషై పుట్టింతర్వాత ప్రతి ఒక్కరికీ ఏవో సమస్యలు, బాధలు తప్పవు. ఎంతసేపూ భర్తల రాక్షస హస్తాల్లో నలిగిపోయే భార్యల కథలే తప్ప భార్యల వల్ల కష్టాలు పడే భర్తలూ వున్నారు, మరి వాళ్ళ కథలు ఎవ్వరూ వ్రాయరేం?'' అన్నా కొంచెం ఆవేశంగా.

''ఏమిటి అంత ఆవేశపడిపోతున్నారు? స్వానుభవం కాదు కదా?'' ఛాయ చిలిపిగా నవ్వింది. ''మీ దయవల్ల నేనింకా అంత అదృష్టానికి నోచుకోలేదు. కాని, చాలామంది వున్నారు అట్లా బాధపడేవాళ్ళు'' నేను కూడా నవ్వేశా.

''వాళ్ళ బాధని మీ బాధగా అనుభవిస్తున్నారన్న మాట. అయితే ఈ రోజు నేను మరో 'శ్రీ శ్రీ'ని చూడగలిగేను'' అంది ఛాయ.

''నేను 'శ్రీ శ్రీ' అంత గొప్పవాడినని మీతో చెప్పలేదు''నేను కొంచెం చిన్నబుచ్చుకోవటం గమనించింది ఛాయ.

''చూడండీ! అనుభూతుల్ని పొందటానికి 'శ్రీ శ్రీ' అంత గొప్పవాళ్ళే కానక్కర్లేదు. మనం వాళ్ళకన్నా కూడా గొప్పవాళ్ళమే కావచ్చు. ఐతే వాళ్ళు పొందిన అనుభూతుల్ని అంత చక్కగానూ వ్యక్తం చెయ్యగలరు. మనం చెయ్యలేము అంతే తేడా'' అంది ఓదార్చుతోన్నట్లు, నవ్వుతూ.

ఛాయలోని గొప్పతనం యిదే. తను సీరియస్‌గా వుండదు, ఎదుటివాళ్ళను వుండనివ్వదు. ఎంత తీవ్రతనైనా యిట్టే తేల్చేస్తుంది మాటల్తో, నవ్వుల్తో. ఛాయకసలు కోపంరాదా ఎప్పుడూ? అని సందేహం వస్తూ వుంటుంది నాకు అప్పుడప్పుడూ.

ఎంతో కష్టపడి చదివి, డిపార్ట్‌మెంట్ పరీక్షలు వ్రాసింతర్వాత అడిగింది ఛాయ. 'బాగా వ్రాశారా?' అని. నాకెంతో 'రిలీఫ్'గా వుంది పరీక్షలు అయిపోవటంతో. అవి పాసైతే ప్రమోషన్ వస్తుంది. రాశానన్నట్లు తలూపేను హుషారుగా.


''గ్యారంటీ ఫెయిలా?''

తప్పకుండా 'ఛాయ'వంటి వ్యక్తి సాహచర్యం లభించాలి. నా జీవితంలో ఆ వ్యక్తి ఛాయే అయితే? ఆ వూహే నా మనసుకి చక్కిలి గింతలు పెట్టింది.

నా కోర్కెని ధైర్యంచేసి 'ఛాయ' ముందుంచటం, ఛాయ 'ఓ.కే.' అనటం, ఆ తర్వాత మా వివాహం అంతా సినిమాలోమాదిరిగా జరిగిపోయింది. ప్రేమించి, పెళ్ళిచేసుకోవటం ఇంత తేలికా? అన్పించింది నాకు. జీవితం పూలపడవలా సాగిపోతోంది. నేను అనుకొన్నట్లుగానే రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయ్ ఛాయ సాహచర్యంలో.

ఓ రోజు సాయంత్రం ఆఫీస్ నుంచి వొచ్చాక, ఛాయ యిచ్చిన వేడి కాఫీ త్రాగుతుంటే హఠాత్తుగా అడిగింది ఛాయ, ''ఏమండీ పాటలొచ్చా మీకు?'' అని.

నేనులిక్కిపడ్డాను ఇప్పుడీ ధర్మసందేహం ఎందుకొచ్చిందా? అని. కాఫీ చొణికి షర్ట్‌మీద పడింది. తన పైట చెంగుతో నా షర్ట్‌మీద అద్దుతూ మళ్ళీ అంది.




ఛాయ అన్నదాంట్లో మొదటిభాగం మాత్రం విన్పించుకొని తలూపేశాను మళ్ళీ. తర్వాత తలకెక్కింది రెండోభాగం.

''మరి బాగా వ్రాశానన్నారు?'' ఛాయ పెదిమలపై కొంటె నవ్వు, ముఖంలో ప్రశ్నార్థకం!

ఎవరేనా సాధారణంగా 'గ్యారంటీ పాసా?' అని అడుగుతారు. అదే వూహతో తలూపేను, ఛాయ కూడ అట్లాగే అడిగి వుంటుందని. నేను ఛాయవైపు కోపంగా చూసేసరికి ''బాబోయ్ నేనే ఏ కొంగనో అయివుంటే గనుక ఈపాటికి బూడిదైవుందును'' ఛాయ లోపలికి పరుగెత్తింది.

నేను నవ్వుకొంటూ చూచ్చేశా.

*** *** ***

రాన్రాను నా మీద 'ఛాయ' ప్రభావం పెరిగిపోతోన్నట్లు అన్పిస్తోంది నాకు. నాకు తెలీకుండానే నా మనసులో 'ఛాయ' రూపం ముద్రించుకు పోతోంది. జీవితం యాంత్రికంగా కాకుండా ఉల్లాసంగా, చైతన్యవంతంగా, కమ్మని కలలా సాగిపోవాలంటే అందుకు

''కనీసం ఆకలుండదు, దాహముండదు, నిన్ను చూస్తుంటే— అన్న పాటైనా వొచ్చా? అని.''

నాకు సినిమాపాటలు బొత్తిగా రావు. అంటే మిగిలినవి వొచ్చని కాదు. అసలు పాటలే రావు. ఛాయ బాగా పాడుతుంది ఏ పాటలైనా.


''ఇప్పుడా పాటలతో ఏం పనొచ్చింది?'' అర్థం కాక అడిగేను.

''ఉన్న పనంతా దాన్తోనే వుంది. మీరీ పూట బియ్యం తీసుకురాకపోతే రేపుదయం నుంచీ మనిద్దరం పాడుకోవల్సింది ఆ పాటే కదా?'' ఛాయ ఖాళీ కప్పు తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

అప్పటి కర్థమైంది నాకు అసలు విషయం. ఛాయ ఎప్పుడూ యింతే. ఏది కావల్సినా డొంక తిరుగుడుగా చెప్తుంది. రాగానే 'అవిలేవు, ఇవిలేవు' అని సాధింపు ధోరణిలో చెప్పదు. అందుకే విసుగన్పించదు, నేను నవ్వుకుంటూ లేచాను బజారు వెళ్ళేందుకు.

*** *** ***

''ఏమిటి సార్ నిద్రలో నవ్వేసుకొంటున్నారు?''



నిద్రలోంచి కళ్ళు తెరచి చూశాను. ఎదురుగా ఛాయ నిలబడి, కొద్దిగావంగి నాముఖంలోకి చూస్తోంది. మెడలోని నల్లపూసల దండ ముందుకు వ్రేళ్ళాడుతోంది. ఇంతకుముందు నాకు కాఫీ యిచ్చినపుడు ఈ దండలేదే? ఓహో! నేనే ఎప్పుడో కొన్నాను కాబోలు. మళ్ళీ మత్తుగా కళ్ళు మూసుకొన్నాను.

ఈసారి ముఖంమీద చన్నీళ్ళు జల్లుగా పడటంతో నిద్ర మత్తంతా వదిలిపోయింది. లేచి కూర్చున్నాక తెల్సింది కాఫీ యివ్వటం కలలో జరిగిందని. అబ్బ 'ఎంత చక్కని కల?' ఆ కల నిజమైతే? పగటి కలలు నిజమౌతాయా? లేచి బాత్‌రూం కెళ్ళి ముఖం కడుక్కొని వచ్చాను.

ఛాయ నిలబడే వుంది. నా టేబుల్ మీద ప్లేట్లో స్వీటు, హాటు, ప్రక్కనే ఓ కప్పునిండా పాయసమూ వున్నాయ్. టవల్తో ముఖం తుడుచుకొంటూ అడిగేను 'ఏమిటీ విశేషం' అని.

"నా బర్త్‌డే" అంది ఛాయ.

"హాపీ బర్త్‌డే" చెప్తూ అప్పుడు చూశాను ఛాయవైపు.

ఎరుపు, నలుపురంగుల్లో చిన్న చిన్న కుట్టుపువ్వులున్న లేత నీలం రంగు సిల్కు చీర, అదే కలర్ జాకెట్, మెడలో నల్లపూసల దండ, తలంటి పోసుకున్న జడలో సన్నజాజి పూలు...ఛాయ బాగుంది రోజుకన్నా. కాని ఆ నల్లపూసల దండ....

"చూస్తూ కూర్చున్నారేమిటి తీసుకోకుండా?" ఛాయ మంచం మీద కూర్చుని పత్రిక తిరగేస్తుంది.

తినాలంటే నేను అడగాలనుకొంటున్న ప్రశ్న గొంతులో అడ్డుపడుతోంది. ఈ మధ్య అమ్మాయిలు అన్నిరంగుల పూసల్తో పాటు నల్లవి కూడా వేసుకొంటున్నారు. ఛాయకూడా 'ఫేషన్' కోసం వేసుకొందేమో? చివరికి గొంతు పెగుల్చుకుని అడిగేను.

"నల్లపూసల దండ మీ అమ్మగారిదా?" అని. ఎలా అడగాలో తెలీలేదు అంతకుమించి.

"వూహూ. నాదే. ఏం బాగోలేదా?" ఛాయ అడిగింది.

"మీదా?" నా గొంతులో ఎన్నో భావాలు ధ్వనించాయి.

"అవును, నాదే. ఏడేళ్ళయింది వేయించుకొని".

అంటే? మైగాడ్! ఛాయకి ఏడేళ్ళ క్రిందటే పెళ్ళయిందా? నాకు తల తిరిగిపోతోంది. ఎవరో నెత్తిన బిందెడు నీళ్ళు దిమ్మరించినట్లుంది. మరి అతను? ఛాయ పుట్టింట్లో ఎందుకుంటోంది? ఎన్నో ప్రశ్నలు—

"మరింతవరకు చెప్పలేదేం?" నాగొంతులోని నీరసాన్ని ఛాయ పసికట్టిందో, లేదో తెలియదు.

"ఏమని? ఏడేళ్ళక్రితం నల్లపూసల దండ వేయించుకొన్నాను, మూడేళ్ళ క్రితం ముత్యాల నెక్లెసు వేయించుకొన్నాను, ఏడాది క్రితం ఎర్రరాళ్ళ పోగులు వేయించుకొన్నాను, వచ్చే నెలలో ఉంగరం చేయించుకోబోతున్నాను, అనా?" ఛాయ నవ్వుతోంది.

అవును. నాబాధ ఏమిటో ఛాయకెట్లా అర్థమౌతుంది?

"మీకు పెళ్ళయిందని" నా ముఖం కళావిహీనంగా వున్నట్లు నాకే తెలుస్తుంది. ఛాయకి తెలీకుండా వుంటుందా?

"మీరడగలేదుగా?" ఛాయ జవాబు తప్పించుకోటానికి చెప్పినట్లు వుంది.

"మిమ్మల్ని చూస్తే నాకట్లా పెళ్ళయిన వారిలా అన్పించలేదు" అన్నాను.

పెళ్ళయిన వారిలా— అంటే? ముఖాన అరచేతి మందాన పసుపురాసి, ఆపైన రూపాయి బిళ్ళంత కుంకుమబొట్టు పెట్టి, జారు ముడేసుకుని, ముత్యమంతా పసుపు ముఖమంతో ఛాయా' అని పాడ్తూ ఇంట్లోను, పేరట్లోనూ గెంతుతుంటాననుకొన్నారా? ఛాయ గలగలా నవ్వింది.

నేను జవాబివ్వలేదు. ఛాయని చూస్తే నేనే కాదు ఎవ్వరూ అనుకో(లే)రు పెళ్ళయి వుంటుందని. బహుశ బాగా చిన్న వయసులోనే చేసేశారేమో?

మీ సందేహాలన్నీ నాకర్థమైనాయి. అతను దూరపు బంధువు, నాకు బావ వరసవుతాడు. అతనికి గడప దాటని ఇల్లాలు కావాలి. నాకు గడపలు లేని ఇల్లు కావాలి. ఇద్దరికీ కుదరలేదు. ఆ 'పంజరం'లో ఇమడలేకపోయాను. అంతే, వచ్చేశా" ఛాయ స్పష్టంగా, నిర్లిప్తంగా చెప్పింది.

ఛాయ ముఖంలో నవ్వు తొంగిన క్షణాలు అవే. ఆ నాలుగు వాక్యాల్లోను నాకు ఛాయ జీవితమంతా అర్థమైనట్లే అన్పించింది. వాళ్ళమ్మ పిలుపు విని 'వస్తు'నని మరోసారి హెచ్చరించి ఛాయ వెళ్ళిపోయింది.

ఛాయ చిరునవ్వు వెనక ఇంతటి విషాద జీవితం దాగివుందని నేనూహించలేదు. 'ఛాయ' వంటి చైతన్యమూర్తిని పోగొట్టుకున్న, పోగొట్టుకోగలిగిన ఆతడెంతో అవివేకి, దురదృష్టవంతుడు అయి వుండాలన్పించింది.

పుట్టినరోజు బహుమతిగా 'ఛాయ'కు నేనేమివ్వాలి? చాలాసేపు ఆలోచించినమీదట అన్పించింది. ఆమె పోగొట్టుకున్న జీవితాన్ని నేను తిరిగివ్వగల్గితే? అంతటి మనస్థైర్యం, శక్తి నాకున్నాయా? ఇదివరకు ఆమె అంటే నాకున్న ఇష్టానికి తోడు, ఇపుడు అదో రకం గౌరవం కూడా కలుగుతోంది. ఈ రోజెలానో గడిచిపోయింది. కనీసం మళ్ళీ వొచ్చే 'బర్త్‌డే' కయినా నేను అనుకొన్న బహుమతి 'ఛాయ' కివ్వగలనా?

చూడాలి, ఈ సంవత్సర కాలమూ నా నిర్ణయాన్ని బలపరచి ముందుకు నడిపిస్తుందో నన్ను, లేక సడలించి వెనక్కేలాగుతుందో?

*** *** ***

ఛాయ నాతో ఎప్పటిలాగే వుంటోంది. నేను కూడ ఛాయ గత జీవితం గురించి యింకేమీ ప్రశ్నించలేదు. నాలుగైదు నెలల తర్వాతనుకొంటా— ఛాయా వాళ్ళన్నయ్యకి 'యాక్సిడెంట్'లో చేతికి బాగా దెబ్బ తగిలిందని 'టెలిగ్రామ్' వస్తే, వాళ్ళ అమ్మా, నాన్నా యిద్దరూ వెళ్ళేరు. ఆఫీస్ నుండి రాగానే చెప్పింది ఛాయ. "ఒక్కదానికీ భోజనం చెయ్యాలంటే సహించదు. మీరు కూడా మా యింట్లోనే భోంచెయ్యండి" అని. అడపాదడపా పండుగలకి వాళ్ళింటి భోజనం అలవాటైంది కాబట్టి నేనూ కాదనలేదు.

కాస్సేపటి తర్వాత వచ్చి అడిగింది 'మీకేం కూర అంటే బాగా ఇష్టం?' అని.

నేను ఉత్సాహంగా మూడు, నాలుగు చెప్తే "అందులో ఏం చేస్తారు?" అనడిగేను.

"అయితే అవి మాత్రం చేయను" అంది నవ్వుతూ.

"అదేమిటి? యిదేనా అతిథిమర్యాదంటే?" నేను నిష్ఠూరంగా అన్నాను.

"ఛ్ఛ! పొరపాటుగా అపార్థం చేసుకున్నారు. మీకిష్టమైన వాటిని నేను వండితే మీకు మళ్ళీ వాటిని తినాలన్పించక

పోవచ్చు. అందుకని అవి వదిలేసి మిగిలినవి ఏవైనా చేద్దామనుకొన్నా" ఛాయ నవ్వుతూ వెళ్ళిపోయింది.

"నువ్వేం చేసినా నాకు బాగానే వుంటుంది ఛాయా" అనుకొన్నా మనసులో.

రాత్రి భోజనం కాగానే నేను డాబామీది కెళ్ళేను. ఆ రోజ 'పౌర్ణమి' కాబోలు. వెన్నెల విరగకాస్తోంది. వంటిల్లు సర్దేసి ఛాయకూడా పైకి వస్తుందేమో? అనుకొన్నా. కాని ఎంతసేపు చూసినా ఛాయపైకి రాకపోవటంతో నేనే క్రిందికొచ్చేను. ఛాయ వరండాలో కూర్చొని తదేకంగా 'ఆల్బమ్' చూస్తోంది. నా అడుగుల చప్పుడు విని కళ్ళెత్తి చూసింది.

ఆ కళ్ళలో తడి. తడిసిన పూరేకుల్లా వున్నాయ్ ఛాయ కళ్ళు. ఏమిటి, ఛాయ ఏడుస్తోందా? నా గుండెనెవరో నొక్కేస్తున్నట్లు అన్పించింది. ఇది ఛాయలో నేను చూడని రూపం, నేనెరుగని మరో కోణం.

కుర్చీలో కూర్చొన్న తర్వాత నిశ్శబ్దంగా ఆల్బమ్‌లో ఓ పేజీ నాముందుంచింది.

ఆ పేజీలో ఓ బాబు ఫోటో వుంది. బహుశ మూడేళ్ళుంటాయేమో? బాబు బాగున్నాడు. మా బాబు ఫోటో అది. పేరు అశోక్. నేనడక్కుండానే చెప్పింది ఛాయ.

నేనులిక్కి పడ్డాను. నేను వింటున్నది నిజమా? ఛాయకి ఓ కొడుకు కూడా వున్నాడా? అసలు తనకి పెళ్ళయిందంటేనే నమ్మటం కష్టం. అందులోనూ ఇంత బాబున్నాడంటే అసలు నమ్మలేం. ఇంకెన్ని ఆశ్చర్యకరమైన విషయాలు వినవలసి వస్తుందో ఛాయ గురించి? కుర్చీలో వెనక్కు వాలి కళ్ళు మూసుకొంది ఛాయ. ఆ మూసిన కనురెప్పల ఏ స్మృతులు తలుపుల్ని తెరుస్తున్నాయో?

"బహుశ వాడిప్పుడు స్కూల్‌కి వెళ్తూ వుండి వుండాలి. బాబు కోసమైనా నేను తనకి వచ్చినట్లు లొంగివుంటానని ఆశ. ఆ బలహీనత ఆధారంగా నన్ను గెలవాలని తన కోరిక" ఛాయ ఒక్క క్షణం కళ్ళు తెరిచింది. ఆ కళ్ళలో ఎంత అసహ్యం?

"మీ అత్తగారు, మామగారు లేరా?" ఏదో అసంపూర్తి చిత్రాన్ని చూస్తున్నట్లుంది నాకు.

"ఉన్నారు. మామయ్యని గడగడలాడించే అత్తయ్య. భార్య భర్తకెంత విధేయతగా వుండాలో ఉపన్యాసొస్తుంది నాకు. ఆవిడ దృష్టిలో నేనో గర్వపోతుని".

అత్తగార్ని తల్చుకొని కాబోలు ఛాయ పెదవుల మీద నవ్వు మెరిసింది. ముఖంలో విషాదం, పెదవులపై నవ్వు–చేదు, తీపి ఒకేసారి రుచి చూస్తున్న అనుభూతి కలిగింది నాకు.

"అసలు మొదటే ఎందుకు చేసుకున్నారు?" మొదట ఛాయకి అతని స్వభావం గురించి తెలీదా? బంధువులేనంది కదా!

"చిన్నప్పటినుండి అనుకొన్న సంబంధమే. కాని, తరచు రాకపోకలు లేవు. పరిచయం కూడ చాలా స్వల్పమే. బాగా వూహ తెల్సిన తర్వాత రెండు మూడు సార్లు మాత్రమే కల్సుకొన్నాం. రూపం, చదువు, ఉద్యోగం–అన్నీ ఉన్నాయి. కాదనేందుకు కారణం కన్పించలేదు. పెళ్ళయిన తర్వాతే ఒక్కొక్క తెరా తొలగి మనిషి మనస్తత్వం యొక్క నగ్న స్వరూపం బయటపడింది. ఎంత ప్రయత్నించినా ఆ వ్యక్తిని ప్రేమించగలగటం సాధ్యం కాదన్పించింది. అప్పటికే బాబు మా జీవితంలోకి వచ్చేడు. అయినా నేను రాజీ పడలేక పోయాను. వచ్చేస్తానంటే బాబుని యివ్వలేదు. ఆగిపోతాననుకొన్నారు. నా అభిమానం కోసం వాడిని వదులుకున్నాను" ఛాయ గొంతులో దుఃఖపు జీర.

నా మనసంతా అవ్యక్తమైన బాధతోనిండిపోయింది. నవ్వుతూ, చలాకీగా సరదాగా వుండే ఛాయ వెనుక ఇన్ని నీలినీడలున్నాయా? 'ఛాయ' వంటి వజ్రాన్ని విలువ కోలేకపోయిన ఆ రవిదెంత మూర్ఖుడైవుండాలి?

"ఛాయా! మీరు గతాన్ని వదిలేసి మళ్ళీ కొత్త జీవితాన్ని ఎందుకు ప్రారంభించకూడదూ" ఛాయ గురించి పూర్తిగా తెలిసినా నా అభిప్రాయం మారటం లేదు.

"రెండేళ్ళ క్రితమే ప్రారంభించేనుగా?" ఛాయ నవ్వేసింది.

"అది కాదు" నాకెలా చెప్పాలో తెలీటం లేదు.

"మళ్ళీ మీరెందుకు పెళ్ళి చేసుకోకూడదు?" నా ప్రశ్నలో ఏదో తెలివితక్కువతనం వున్నట్లు నాకే అర్థమౌతోంది.

ఛాయ గొప్పజోక్ విన్నట్లు చాలసేపు నవ్వింది. నేను చిన్నబుచ్చుకున్నాను. "మొదటిసారి భర్తర్ని కొనుక్కొనేందుకే ఆంధ్రదేశంలో ఆడపిల్లలు నానా అగచాట్లూ పడుతోంటే పెళ్ళయి పిల్లలున్న నాలాంటి వాళ్ళని చేసుకొనే దేవరండీ బాబూ?" ఛాయ నా అజ్ఞానానికి జాలి పడ్తోన్నట్లు మళ్ళీ నవ్వింది.

ఛాయ మాటల్లో నిజం వుండొచ్చు, కాదనను.

"ఛాయా మీరు ఒప్పుకొంటే ఈ క్షణంలో మీ చేయందుకొనేందుకు నేను సిద్ధంగా వున్నాను" ఆ క్షణంలో నాకాతెగువ, ధైర్యం ఎక్కడినుండి వచ్చాయో తెలీదు.

ఛాయ ఒక్కక్షణం విచిత్రంగా నా ముఖంలోకి చూసి, తర్వాత హఠాత్తుగా సీరియస్ అయిపోయింది. "సారీ కృష్ణా! ఏదో నా కథంతా చెప్పి మీ మనసు కరగించి, మీరీ నిర్ణయానికి రావాలని కాదు నేను చెప్పింది. ఒక్కోసారి ఆత్మీయుల దగ్గర మనకి తెలీకుండానే మన మనసులోని రహస్యపు ఎరల తలుపులు తెరుచుకుంటాయి. మీ విశాల హృదయానికి నా కృతజ్ఞతలు. గుడ్ నైట్".

నేను మరో మాటమాట్లాడే అవకాశం లేకుండా ఛాయ లేచి లోపలికెళ్ళిపోయింది. నేను నీరసంగా రూమ్‌లో కొచ్చి మంచం మీద వాలిపోయాను. ఆలోచనల్తో నిద్రపట్టటం లేదు. ఛాయ ఎందుకింతగా ఆకర్షిస్తోంది నన్ను? ఈ ప్రశ్నకి జవాబు దొరకటం లేదు నాకు. 'ఛాయ' కోసం లోకాన్నంతా ఎదిరించాలని మాత్రం అన్పిస్తోంది. 'ఛాయ'లోని ఆ చిలిపిదనం, చక్కని మాటతీరు,నవ్వు, వ్యక్తిత్వం,ఆత్మాభిమానం అన్నీ నాకు, అద్భుతంగా నాకు మాత్రమే కావాలన్పిస్తోంది. ఎలాగైనా సరే నా నిర్ణయం క్షణికం కాదని 'ఛాయ'కి అర్థమయ్యేట్లు చేసి, ఛాయ అంగీకారం పొందాలి అనుకొన్న తర్వాత నిద్ర పట్టింది.

***        ***        ***

అవకాశం దొరికినప్పుడల్లా ఛాయతో నా అభిప్రాయాన్ని ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కూడ వ్యక్త పర్చుతోనే వున్నా. ఛాయ ఇదివరకటిలానే వుంటుంది నాతో. నాకోరికను తాను ఏదో చిన్న పిల్లవాడు 'చందమామ' కావాలని అడిగితే త్రోసిపుచ్చినట్లుంది.

"లోకంలో స్త్రీమూర్తులెవ్వరూ లేనట్లు మీ దృష్టి నా మీద పడిందేం ఖర్మ?" ఛాయ నవ్వుతూ అనేది.

"మీకే రంగంటే ఎక్కువిష్టం?"

"లేత నీలం రంగు" నా ప్రశ్నకి జవాబిచ్చింది ఛాయ.

"లోకంలో యింకేం రంగులూ లేనట్లు మీ దృష్టి దాని మీద పడిందేం పాపం?"

"తర్కం వేరు, జీవితం వేరు"

"వేరు లేదు, కాండమూ కాదు. మీరన్నది, నేన్నది ఒకటే. ఇన్నిటికి కారణాలుండవు" నేను మొండిగా జవాబిచ్చేను.

"నేను బహుశ మీకన్న ఏ మూడు, నాలుగేళ్ళో పెద్ద దాన్ని కావచ్చు", ఛాయ కారణాలు వెతుకుతోంది అంటే— తనక్కూడ మనసులో నేనంటే యిష్టమేనా? నాకు ఉత్సాహం వచ్చేసింది, ఆ వూహ కలగ్గానే.

"గొప్పవాళ్ళలో చాలామంది భార్యలు వాళ్ళకన్న పెద్ద వాళ్ళే".


"అంటే నన్ను చేసుకొని మీరుకూడా గొప్పవాళ్ళు కావాలనా?" ఛాయ నవ్వింది.

"పెద్దవాళ్ళని చేసుకొన్న వాళ్ళందరూ గొప్ప వాళ్ళవు తారని నేనన్లేదు" ఈ మధ్య నేను ఛాయతో మాటల్లో ఓడిపోవటం లేదు.

"మీరీ మధ్య చాలా బాగా మాట్లాడుతున్నారే?" ఛాయ వేళాకోళం క్రింద భావించటం నాకు భరించరానిదిగా వుంది. చిన్నపిల్లల్తో ఆడుకొంటున్నట్లు వుంది ఛాయ ధోరణి.

"మీరు సీరియస్‌గా తీసుకోవటం లేదు నేను చెప్పేదాన్ని" నేను కోపం తెచ్చుకొన్నాను.

"ఏంచైను? నాకేమో వూరికెనే నవ్వొచ్చేస్తుంది. సీరియస్ అంటే పెదిమలు బిగించి, కళ్ళురిమి



మాట్లాడం— అంతేగా?" ఛాయ అభినయిస్తూ అంది.


ఇప్పటికే మొదటిసారి ఛాయ దగ్గర నా నిర్ణయాన్ని వెలిబుచ్చి ఆరేడు నెలలవుతోంది. అప్పటి నుండీ ఈ విషయం మా యిద్దరి మధ్యా నలుగుతూనే వుంది.

"లేకపోతే ఆ తర్వాత 'జగమే మాయ' అని పాడుకొంటూ వీధులవెంట తిరుగుతారా?"

"అదంతా మీ కనవసరం, మీరు మాత్రం ఖచ్చితంగా పదిరోజులు టైమిస్తున్నాను. ఈ లోపు ఆలోచించుకొని నాకు ఏ విషయమూ చెప్పండి. ముందు ముందు బాబు మీ దగ్గర కొచ్చేసినా నాకెల్లాంటి అభ్యంతరమూ వుండబోదు. ఇంతకుమించి మరోరకంగా వాగ్దానాలు, హామీలు యివ్వడం— నన్ను నేను తేలిక పర్చుకోవటమే అవుతుంది".

మరోమాటకి అవకాశం ఇవ్వకుండా నేను లేచి వెళ్ళిపోయాను. నాకు తెల్సు. ఈసారి ఖచ్చితంగా ఛాయ ఆలోచించి తీరుతుందని.

పదకొండో రోజుకోసం ఎదురుచూడసాగాను.




ఛాయ నిర్ణయం నాకు అనుకూలంగా వుంటుందని అంతరాంతరాల్లో గొప్ప నమ్మకంగా వుంది.

*** *** ***

వారంరోజుల తర్వాత ఆఫీస్‌కి 'టెలిగ్రాం' వచ్చింది అమ్మకి సీరియస్‌గా వుందని.

ఇంటికి వెళ్ళేసరికి అమ్మ వరండాలోనే కూర్చొని వుంది 'కందిపప్పు' బాగుచేస్తూ. చెల్లెళ్ళు షికార్లకెళ్ళినట్లున్నారు. ముభావంగా పలకరించింది అమ్మ. అమ్మకి బాగానే వుందిగా? 'టెలిగ్రామ్' ఇవ్వటంలో వీళ్ళ ఉద్దేశ్యం నాకర్థం కాలా.

రాత్రి భోజనం చేసిన తర్వాత నేను చదువుకొంటుంటే నాన్న నాదగ్గర కొచ్చేడు. ఓ ఉత్తరం నాకందించి చదువుతున్నంత సేపు నా ముఖంలోకే చూస్తూ కూర్చున్నాడు.

పశుపతిరావుగార్కి,

మీ అబ్బాయి పట్నంలో ఓ అమ్మాయిని పెళ్ళిచేసుకొనే ఉద్దేశ్యంలో వున్నాడు. ఆ అమ్మాయికి అంతకుముందు పెళ్ళవటమే కాకుండా ఓ కొడుకు కూడా ఉన్నాడు. కాబట్టి మీరు ముందుగా జాగ్రత్త పడవలసింది.

ఇట్లు, మీ శ్రేయోభిలాషి".

క్రింద సంతకం లేదు. ఎవరై వుంటారు ఈ శ్రేయోభిలాషి? ఛాయ నిర్ణయం తెలుసుకోకుండా నాన్నకి ఉత్తరంలోని విషయం 'నిజ'మని ఎల్లా చెప్పటం? నేను ఆలోచనలో వుండగానే నాన్న మౌనంగా లేచి వెళ్ళిపోయాడు, మరేమీ అడగకుండా. అప్పటికి గండం గడిచింది అనుకొన్నా.

అర్ధరాత్రి ఘొల్లున ఏడుపులు వినిపించి ఉలిక్కిపడి లేచాను. మధ్యగదిలో దూలానికి తాడు చుట్టిన పాములా వ్రేలాడుతోంది. అమ్మని చాపమీద పడుకో బెట్టేరు. చెల్లాయిలు, తమ్ముళ్ళు ఏడుపుముఖాల్తో వున్నారు. నాన్న ముఖం రాయి మాదిరిగా వుంది. వాళ్ళెవరూ నావైపు చూట్టం లేదు.

"ఏమైంది?" నేను ఆత్రుతగా అడిగేను.

అందరూ ఒక్కసారి నావైపు అసహ్యంగా చూశారు.

"నీ ప్రయోజకత్వం విని సంతోషం పట్టలేక చావబోయింది" నాన్న మాటల్లో వ్యంగ్యం, కోపం—

నేను నోట మాట రానట్లు నిల్చుండి పోయాను. ఇది నేనూహించని స్థితి. దీని నెదుర్కోటానికి నేను సిద్ధంగా లేను.

"నీ తర్వాత నీ పుణ్యమా అని నీ చెల్లెళ్ళు పెళ్ళి పెటాకుల్లేకుండా వుంటారు. వాళ్ళనూస్తూ నేనేడువలేను. ఇదంతా ఎందుకొచ్చిన గొడవ కాని ఆ మూలలో 'ఎండ్రిన్' డబ్బా వుంది. నీ చేతుల్తో మా అందరికీ తలా కొంచెం పోసి పుణ్యం కట్టుకో. ఆ తర్వాత నువ్వే పిల్లని పెళ్ళి చేసుకొన్నా అడిగే వాళ్ళుండరు" నాన్న మాటలవి.

వీళ్ళంతా నన్ను చస్తామని బెదిరిస్తున్నారు. వీళ్ళ స్వార్థం నాకు సంకెళ్ళు వేస్తోంది. వీళ్ళ ఏడుపుల ప్రవాహంలో నేను 'ఛాయ'కి చెప్పిన మాటలు గడ్డిపోచల్లా కొట్టుకుపోతున్నాయి. మొట్టమొదటిసారి నేను 'అనాథ'ని కానందుకు బాధపడ్డాను.

మూడ్రోజుల తర్వాత మామయ్యగారమ్మాయి 'అరుణ'తో నా వివాహం ఏ అట్టహాసాల్లేకుండా జరిగిపోయింది. మామయ్య వారం తిరక్కుండా 'ట్రాన్స్‌ఫర్' ఆర్డర్ నా చేతికిచ్చేడు. మా బాబాయి రూంకెళ్ళి నా సామాన్లవీ పట్టుకొచ్చేడు. 'ఛాయ'ని మళ్ళా నేను కల్సుకొనే అవకాశం లేకుండా కట్టుదిట్టంగా జరిగిపోయాయన్నీ.

ఏ మొహం పెట్టుకొని వెళ్ళాలి ఛాయని చూసేందుకు? అనుకొన్నవన్నీ ఆచరణలోకి తేవటం ఎంత కష్టం? అవును, ఛాయన్నది నిజం జీవితం వేరు, తర్కం వేరు, ఛాయ వేళాకోళంగా తీసుకోబట్టి సరిపోయింది. లేకపోతే తను నిజంగా బాధపడేది కాదూ? ఇవన్నీ నన్ను నేను మభ్యపెట్టుకొనేందుకు చేసిన ఆలోచనలని నాకూ తెలుసు.

అంతకుమించి నేనేం చెయ్యగలను?

*** *** ***

"తరువాతి స్టేషనే ఖమ్మం".

ఛాయ మాటలకి నేను వర్తమానంలోకి వచ్చాను. ఛాయ నా గురించి ఏమనుకొంటూ వుంటుంది? పిరికివాడని అసహ్యించుకొంటోందా? ఇపుడు తన ముఖంలో అల్లాంటి ఛాయలేమీ లేవు.

"మీ గురించి ఏమీ చెప్పలేదేం?" నేను ధైర్యం చేసి అడిగేను.

"ఏముంది చెప్పటానికి? బాబు నా దగ్గర కొచ్చేశాడు సవతి తల్లి గొడవపడలేక. ఇప్పుడింట్లో అందరూ ఆవిడ చేతి కీలుబొమ్మలని విన్నాను" ఛాయ నవ్వింది, ఆ నవ్వులో వాళ్ళపట్ల జాలి వుంది.

"మీరు పెళ్ళి చేసుకోలేదా?" అడగలేక అడిగేను.

"లేదు. కాని, చేసుకొంటాను. ఆలోచనని ఆచరణలో పెట్టగల వ్యక్తి లభించినపుడు", ఛాయ జవాబు నన్ను ఛెళ్ళున తాకింది.

నేను దిగవల్సిన స్టేషన్ దగ్గరకొచ్చేస్తోంది. బ్రీఫ్‌కేస్‌లోంచి నా డైరీ తీసి ఛాయ కందించి "మీ గుర్తుగా ఏమైనా వ్రాయండి" అనడిగేను.

బండి స్టేషన్‌లో ఆగింది. నేను దిగిపోయేను. కిటికీలోంచి డైరీ నాకు అందించి "గుడ్‌బై కృష్ణా!" అంది ఛాయ చిరునవ్వుతో.

బండి కదిలింది. ఛాయ చెయ్యి వూపుతోంది. నేను కూడా చెయ్యి వూపేను. తర్వాత డైరీ తెరచి ఆత్రుతగా చూసేను.

డియర్ కృష్ణా!

జ్ఞాపకాలు మిగలవల్సింది గుండెల లోతుల్లో. కాని కాగితం మీది రాతల్లో కాదు.

ఛాయ.

ఆ వాక్యాన్ని రెండుమూడుసార్లు చదివిన తర్వాత ఆ 'రైటింగ్' ఎప్పుడో ఎక్కడో చూసినట్లు అన్పించింది. రెండుక్షణాల తీవ్ర మథనం తర్వాత గుర్తొచ్చింది. ఆరోజు నాన్న చూపించిన ఉత్తరంలోని 'రైటింగ్' యిదే. అంటే ఆ శ్రేయోభిలాషి'....? నాకు ఆ క్షణంలో అంతా అర్థమైంది.

నాకు కనుమరుగౌతున్న ఆ బండి వెనుక పరుగెత్తుకెళ్ళాలన్న పిచ్చికోర్కె కలిగింది. ఎప్పుడైనా మళ్ళీ 'ఛాయ' కలిస్తే ఒకే ఒక ప్రశ్న అడగాలనుంది. "ఎందుకిలా చేశారు?" అని. ○